# అమ్మసిగ్గు

– ఎం.ఆర్. అరుణకుమారి



"ఛ! ఛీ! మరీ ఇంత సిగ్గులేని తనమా?"

జుగుప్సతో కూడిన మాలతి వ్యాఖ్యానానికి చేతి కున్న వాచీని, ఎంతకీ మా ఏడో నెంబరు బస్సును మోసుకురాని రహదారినీ-మార్చి మార్చి చూసు కుంటూ అసహనంగా వున్న నేను తనవేపు చూశాను ప్రశ్నార్థకంగా!

తెల్లటి తన మొహం కోపంతోనో, రోషంతోనో ఎర్రగా కందిపోయింది. దానికి కారణం మా ఎదురుగా వస్తున్న ఓ ముసలి బిచ్చగత్తె అనడం కన్నా స్టాపింగులో వున్న మగ ప్రయాణీకుల వ్యాఖ్యా నాలే అనడం-మొగుడు కొట్టిందానికన్నా తోడికోడలు నవ్విందానికేడుస్తున్నానంత సబబుగా వుంటుంది.

"ఇప్పుడే ఇలా వుంది. వయసులో ఎలా వుండో!" ఒకరంటే.

"మనిషి మునిసిపాలిటీ ఐనా, పర్సనాలిటీ భలేగా వుండి వుంటుంద"ని మరొకరంటే ఇంకొకరు ఇంకా ముందుకు వెళ్ళి వయసులో ఆమె అంగాంగ వర్ణన చేస్తూంటే-కొందరు చాటుగా, కొందరు బాహా టంగా, కొందరు ముసిముసిగా నవ్వుకుంటూ-ఆవిడ తమ దగ్గరకు రాగానే అప్రయత్నంగా ఓ అడుగు వెనక్కివేసి చీదరించుకుంటూ-'హు! చదువుకున్న, 'కొన్న' చదువులు సంస్కారాన్ని రంగరించుకో లేవా?' ఉక్రోష పడిపోతూ ఆ బిచ్చగత్తె వేపు చూశాను.

హుక్స్ లేని జాకెట్టు. నడుముకు చుట్టిన ఓ పాత గుడ్డముక్కా "నేటి సినీ హీరోయిన్లకేమాత్రం తీసిపోని వస్త్రధారణ! అక్కడ ఎగబడి చూడాల నిపించే సంస్కృతీ దారిద్ర్యం! ఇక్కడ ఆర్థికపరమైన భయంకర దారిద్ర్యం! ఛ్ఛీ!" నిన్న అన్న సుజన మాటలు గుర్తొచ్చాయి.

హఠాత్తుగా ఏదో గుర్తొచ్చి ఉలిక్కిపడ్డాను. వెంటనే ఆ బిచ్చగత్తె వేపు చూశాను. ఆచ్ఛాదన లేని శరీర భాగాల పట్లగాని, మావటివాడి అంకుశం పోట్ల లాంటి వ్యాఖ్యానాలు, చీదరింపులతోగాని- దున్న పోతు మీద వాన కురిసినట్లు తనకేమాత్రం లక్ష్యం లేనట్లు నిర్వికారంగా, ఒక్కొక్కరి దగ్గరా ఆగి చేయి చాచి అడుక్కుంటున్న ఆ బిచ్చగత్తెను నిశితంగా పరిశీలించాను.

సందేహం లేదు. ఈవిడ...ఆవిడే! నా జ్ఞాపకాల దొంతర్లో ఈమె జ్ఞాపకాన్ని వెతుక్కోనక్కరలేదు. ఎందుకంటే ఈమెను నిన్న మధ్యాహ్నమేగా నేను చూసింది!

అవును. నిన్న మధ్యాహ్నం తను స్కూల్నుండి ఇంటికెళ్ళేసరికి రెండయిపోయింది. మార్చి నెల ఎండలు ఎడాపెడా సెగల వూలు వర్షిస్తూంటే శరీరమంతా చెమట్ల చిరచిరలతో-పెనం మీద నీరు విడిచిన తోటకూరలా వడలిపోతోంది.

"ఈ ఒంటిపూట బడి రానన్నా వస్తుందిగాని, మంచి మధ్యాహ్నం స్కూల్నుండి ఇంటికొచ్చేసరికి సగం ప్రాణం పోతోంది" మనసులోనే విసు క్కుంటూ, ఫ్రిజ్‌లో నుండి వాటర్ బాటిల్ తీసి అలాగే గడగడా తాగుతున్న నేను వీధి వరం డాలో నుండి నాన్న గట్టిగా పిలవడంతో ఏమైందోనని గబగబా వెళ్ళాను చేతిలో బాటిల్తోనే!

"ఏదైనా ఓ చీరిలా తీసుకు రామ్మా!" ఏదో చూడరాని దృశ్యం చూసినట్లుగా నాన్న మొహం ముడుచుకు పోయి వుంది-కమలాప్తుడు కనుమ రుగవగానే ముడుచుకుపోయే కమలంలా!

"చీరా? ఏం చీర? అసలు చీరెందుకు నాన్నా?" అయోమయంగా చూశాన్నేను.

"అబ్బ! ఏదన్నా పాత చీర తేమ్మా ముందు" మధ్యలో కరెంటు పోతే ఈలలు, కేకలు వేసే సినిమా ప్రేక్షకుల్లా-నాన్న గొంతులో అసహనం గద్దించింది.

"ఏమైంది? ఎందుకు నాన్నలా అరుస్తున్నారు?"

భారతం వింటూ వింటూ నిద్రపోయి హఠాత్తుగా మెలుకువ వస్తే-'పాపం! సీత ఎందుకట్టా ఏడుస్తా అరస్తావుందీ?' అని అయోమయంగా ప్రక్కవారి నడిగితే...ఏం జవాబు చెప్పగలరు?

"ఏమో! నువ్వే పోయి అడుగు!" అన్నం పరబ్రహ్మ స్వరూపమైతే-పొద్దున్నుంచీ ఇంకా ఆ పరబ్రహ్మ దర్శనమే చేయని ఆత్మారాముడో, ఆకలి కృష్ణుడో-క డుపులో పేగుల్ని బ్రేకు డాన్సు చేయిస్తుంటే -నాన్న మీది విసుగు అమ్మను కసురుకునేట్లు చేసింది. అల్మారా తలుపు తెరిచి ఓ రెండు ఉతుకులే పడ్డ మంచి నూలు చీరనే తీసుకుని వరండాలో కొచ్చేసరికి నాన్న అమ్మతో అంటున్నారు.

"...కడుపునిండా తిండిలేకపోయినా పర్లేదుగాని మానాన్ని కాపాడే మూరెడు బట్టక్కూడా కరువైతే ఎలా?"

"ఇవ్వమ్మా శిల్పా! ఆ చీరావిడకు ఇవ్వు" నాన్న గేటు వేపు చేయి చూపారు.

"ఎవరూ లేరే" అనుకుంటూ గేటు దగ్గరకు వచ్చి వీధిలోకి చూశాను. గేటు పక్కనే, గోడ నీడలో నక్కి నట్లున్న ఆవిడ్ని చూసి క్షణంపాటు చలించిపోయాను. హుక్స్ తీసిన జాకెట్టు, మొలకు చుట్టుకున్న గుడ్డపే లిక-ఇలాగే...తొడల్తోసహా...నగ్నంగా! సుసంపన్నమైన నా దేశ సంపదంతా ఏ స్వార్థపు కొండ చిలువల




బొజ్జల్లో చల్లగా బజ్జోమన్నదో గదా! సగటు మనిషి అభిమానాన్ని చంపుకొంటే ఫర్వాలేదు. ఆకల్ని చంపు కుంటే ఫర్వాలేదు. సాంప్రదాయాలు, సంస్కృతుల్ని 'నాగరికత' పేరుతో మరచిపోయినా ఫర్వాలేదు. కాని అనాగరికుల్లా-ఆటవికుల్లా-'సిగ్గు'ను సైతం మరపించే ఈ దారిద్ర్యం-ఏ పురోగతి ప్రతిఫలం?

అమ్మ అన్నం, కూరా తెచ్చి ఆవిడ చేతిలో వున్న సత్తు గిన్నెలో వేసింది.

"మీరు సల్లంగుండాల తల్లీ! దేవుడు మీకు కావ ల్సినవన్నీ మస్తుగా ఇత్తాడు. మీ దరమమే మిమ్మల కాపాడ్తాది తల్లీ!" అంటూ నేను ఇచ్చిన చీరను తన పక్కనే వున్న ఓ మూటలోకి కుక్కింది.

"ఏవిటీ, చీర మూటలో పెడ్తున్నావ్? కట్టుకో!" అన్నాను నేను కాస్త ఆశ్చర్యంగా!

"కట్టుకుంటాలే అమ్మాయా!" మూట భుజానికి తగిలించుకుని, చేతిలో గిన్నెతో సాగిపోయింది, వెనుక నుంచి అమ్మా, నేనూ పిలుస్తున్నా ఆగకుండా!

"ఏమిటీ ముసిల్దీ? ఇలా బట్టల్లేకుండా తిరిగి చీరలు పోగుచేసుకుంటుందా?" అమ్మలో అనుమానం-ఇం తింతై...వటుడంతైనట్లు క్షణాల్లో పెరిగిపోవడమే కాదు,-

'వీధిలో ఎలా కట్టుకుంటుందీ? వరండాలో కన్నా రమ్మనకపోయావా?" అన్న నాన్న మీద ఆగ్రహంగా మారిపోయింది.

"ఆ! డ్రస్సింగ్ మిర్రర్ దగ్గరకు తీస్కొస్తా అన్నీ ఇట్లాంటి పనులే! ఆ ముసిల్దానికి చీరల్లేక కాదు, సిగ్గులేక ఇలా తిరుగుతోంది. దాని దగ్గరున్న బట్టల మూట చూశారా? పోనీ, ఇవ్వడిచ్చిందన్నా కట్టుకోవచ్చుకదా! ఆ! ఇలా తిరిగితేకదా...మన్లాగా... సిగ్గుపడ్డవాళ్ళు చీరలిచ్చేదీ...చూడ్లేక..."

"లేపోతే:..ఎంత గింజుకున్నా మీరిస్తారా..." నాన్న ఎద్దేవాతో అమ్మ కోపం నసాళానికంటింది. ఉరు మురిమి మంగలం మీద పడ్డట్టు ఆమె కోపం తిట్ల వర్షమై నాపైన కురిసింది.

"ఆయన సరే! రిటైరైనప్పట్నుండీ...పొద్దస్తమానం... ఇలా నన్ను వేపుకు తింటున్నారు ప్రతీ దానికీ! నీకన్నా బుద్ధుండక్కర్లా! అంత మంచి చీర ఇచ్చేసి నావు. ఏదో పాతదో చినిగిపోయిందో... ఇవ్వక...మళ్ళీ టీచరుద్యోగం వెలగ బెడ్తున్నావూ?"

నిన్న సాయంత్రం వీధి చివరనున్న సుజన వచ్చి ఆ బిచ్చగత్తె గురించి బాధపడి తనూ చీరిచ్చిన విషయం చెప్పినప్పట్నుండీ అమ్మ సాధింపు ఎక్కువైంది.

"నేను చెప్పలా! బట్టల్లేకండా...తిరుగుతూ...చీరలు పోగుచేసుకుంటోందనీ"

అమ్మ మాటలే నిజమా? లేకపోతే-చీరలన్నీ ఏం చేస్తుందీ ముసలావిడ కట్టుకోకుండా. ఆడతనాన్ని, ఆడతనపు సహజాలంకారపు సిగ్గునూ-నగ్నంచేసి-ఎ గతాళి చేయిస్తున్న ముసిల్దాని నిర్లజ్జకూ, నిర్లక్ష్యానికీ నాకు నిజంగానే చాలా కోపమొచ్చేసింది.

శిశిరం ఆకుల్నంతా రాల్చేసినట్లు-నా కోపాన్ని చెడామడా నాలుగు తిట్లుగా విదిల్చేసి-అక్కడ మగ పురుగులు ఊసిన అసభ్య మాటల ఉమ్మును కడిగేసు కోవాలన్న ఆవేశంతో రెండడుగులు ముందుకేశాను. ఇంతలో కొండలంటుకున్నపుడు అందిన సమాచారా నికి-ఆరిపోయిన బూడిదను రేపేందుకు హడావి డిగా వెళ్ళే ఫైరింజనంత వేగంగా వచ్చి ఆగింది. మా ఏడో నంబరు బస్సు-పిచ్చిన, పుచ్చిన మేడిపండులో లుక లుకలాడ్తున్న పురుగుల్లా కిటకిట లాడ్తున్న ప్రయాణీకుల్తో! ఇంకా ఆలస్యం చేస్తే, ఫుట్‌బోర్డు మీద కూడా ఎక్కలేమని, ఇప్పటికే స్కూలుకు ఆలస్య మైపోతున్నామన్న స్పృహతో చచ్చిన బస్సు ఎక్కేయాల్సి వచ్చింది.

మధ్యాహ్నం-అన్నం తింటూ-ముసలి బిచ్చగత్తె గురించి అమ్మకు చెప్తుంటే నాన్న విసుక్కున్నారు. "అబ్బబ్బ! ఏడో... పెద్ద...పట్టుచీరిచ్చేసినట్టు...నిన్నటి నుండీ ఏమిటీగోల? ఆ వేషం వెనుకే వెత దాగుందో..."

అమ్మ నాన్న మాటలకు మొహం మూడు వంకర్లు తిప్పతూంటే నేను నవ్వేశాను. అంతటితో మా ఇంట్లో ఆ ముసలావిడ ప్రసక్తి ముగిసిందనే అనుకున్నాను. ఐతే మళ్ళీ ఎక్కడైనా కన్పిస్తే మాత్రం ఆడదై వుండీ-అలా ఆడతనాన్ని అవమానాలపాల్జెయ్యవద్దని గట్టిగా మందలించాలన్న నిర్ణయం మాత్రం నాలో బలపడింది.

* * *

రెండు నెలల తర్వాత, దాదాపు నేనా ముసలావిడ గురించి మరచిపోతున్నపుడు ఆవిడ నాకు కన్పిం చింది గాని నేను మందలించడం మాట అటుంచి కనీసం నోరు కూడా విప్పలేని విభ్రాంతితో, విచా రంతో నన్నెక్కడ ఆవిడ చూస్తుందోనన్న భయంతో తలవంచుకుని గబగబా వెళ్ళిపోవాల్సి వచ్చింది.

ఆ రోజు స్కూలుకు వెళ్తూంటే...బస్సు మధ్య లోనే టైరు పంక్చరై స్టెపినీ లేక ఆగిపోతే మిగిలిన ప్రయాణికుల్తో బాటు నేనూ మాలతీ నడుస్తున్నాం.

"మా హెడ్మాస్టరుకేం, హాయిగా హీరోలా...హోం డాలో వెళ్ళిపోతాడు. ఇలా ఒకటీ అరా బస్సులుండే గ్రామాలకు లేడీ టీచర్సును వేసి ఏడ్పిస్తారు. యూని యన్ నాయకులు, వారి బంధువర్గము ఇంటెదు రుగానో, పొలం పక్కనో వుండే స్కూళ్ళు నొదిలి పెట్టరు. లేటయితే మా హెడ్మాస్టరి హేమరింగ్... బాబోయ్! ఇవాళ తప్పదు!" మాలతి భయపడ్తోంది. నేను సింగిల్ టీచర్ని గనుక ఆ బాధలేకపోయినా, సమయానికి స్కూలుకెళ్ళిపోవాలన్న సిద్ధాంతం నాది. నేనే లేటుగా వెళ్తే- లేటుగా వచ్చే పిల్లల్ని మందలించే నైతిక బలం నాకెలా వుంటుందీ?

"సర్లేవే! 'ఇంటిపక్కనే స్కూలు. ఉద్యోగం చేస్తు న్నట్లే లేదు. బోర్‌గా వుంది. ఇలా బయటికొస్తే-కదా మార్పు, నలుగుర్నీ చూడ్డమూ'-అని వారనుకుం టున్నారేమో!" మాలతితోబాటే గబగబా నడుస్తూ, ఓదార్చబోయాను.

"ఏం మేడమ్! బస్ రిపేరా? రండి డ్రాప్ చేస్తాను" స్కూటర్ని మా పక్కన స్లో చేస్తూ మాలతి పనిచేసే ఊరతను! అడుగుతున్నది నన్ను. ఎంత తెలిసిన వారైనా సరే నేను వెళ్ళను. నాకిష్టం వుండదు.

"బస్సులో ఎంతోమంది మధ్యన ఇరుక్కుని వెళ్ళటం లేదా?" మాలతి వాదించబోతే నవ్వేస్తానంతే గాని పొడిగించను. వివాదానికి దారితీసే సంవాదం కూడా నాకిష్టం లేనిపనే!

"నో థాంక్స్! నాకు స్కూలు దగ్గరే! మీ ఊరి మేడమ్ వస్తారు. తీసుకెళ్ళండి ప్లీజ్?" షుగరు పేషెంటు స్వీటు వేపు చూసి గుటకేసినట్లు-అయి ష్టాన్ని మింగుతూ, నా వేపోసారి మిర్రి చూసి చూసి, దూసుకు పోయాడతను మాలతిని ఎక్కించుకుని.

సన్నగా నవ్వుకుంటూ నడుస్తున్న నేను రోడ్డు పక్కనే విన్పించిన కంఠంలోని ఆక్రోశంలాంటి ఆవేద నకు టక్కున ఆగిపోయి, అటువేపు చూశాను.

"...నీకిది నాయం కాదురా! నేన్నిన్ను పదినెల్లు



మోసి, కన్నమ్మనురా, నా కొడకా! నన్నిట్టా గుడ్డ ల్లేకండా ఈదులు, రోడ్లూ తిప్పేదానికి నీకు, తిరిగే దానికి నాకూ సిగ్గేకపాయినా, నన్నిట్టా జూసి సిగ్గుబడి ఏ పాతచీర గుడ్డిచ్చిన ఏయమ్మో మల్లా కన్పడ్తే-వాల్ల మొగం నేనెట్టా జూసేదిరా? అమ్మను సిగ్గేనిదాన్ని జేసి నా కొడకా చీరలమ్ముకొంటుండాడని వాల్లకు నేనెట్టా జెప్పేదిరా! దేవుడా! నాకు సావన్నా రాదే!"

హృదయ విదారకంగా రోదిస్తున్న ఆ 'అమ్మ సిగ్గు'ను నేనేమని మందలించగలను? ఆవిడకు కన్పించి- ఆవిడ మరింత సిగ్గుతో వేదన పడకుండా వేగంగా అక్కడ్నుంచి తప్పుకోవడం తప్ప?★

వచ్చేవారం కథ
**వెన్నెల**
-డి. ఆర్. ఇంద్ర





13